
సాక్షి
పల్నాడు
గురువారం । 26 । సెప్టెంబర్ । 2024



45.562 టీఎంసీలు నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 35,643 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 45.562 టీఎంసీలు నిల్వ ఉంది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 4012 క్యూసెక్కులు విడుదల చేశారు.



విద్యార్థులకు కంటి పరీక్షలు

రొంపిచర్ల: జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రొంపిచర్లలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 355 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

ప్రతిపక్ష నాయకులపై పెరిగిన వేధింపులు

టీడీపీ నేతల ప్రోద్బలంతో పోలీసులతో కక్షసాధింపు చర్యలు

గుంటూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ శ్రేణులను టార్గెట్ చేసి పోలీసులు వేధిస్తున్నారు. తాజాగా చిలకలూరిపేట నియోజకవర్గంలోని నాదెండ్ల మండలం చందవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గొంటు శ్రీనివాసరెడ్డి, పార్టీ మద్దతుదారుడు, పంచాయతీ సర్పంచ్ షేక్ మస్తాన్‌వలి, గొంటు శ్రీకాంత్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, మరో ముగ్గురు బీసీ వర్గానికి చెందిన వ్యక్తులను వేధింపులకు గురిచేస్తున్నారు. వారం రోజులుగా వీరిని ప్రతి రోజూ ఉదయాన్నే నాదెండ్ల పోలీస్‌స్టేషన్‌కు పిలిపిస్తున్నారు. అర్ధరాత్రి వరకూ స్టేషన్‌లో ఉంచి పంపుతున్నారు. రెండు రోజుల క్రితం సర్పంచ్ షేక్ మస్తాన్‌వలితో పాటూ పార్టీ శ్రేణులను పోలీసులు కొట్టినట్లు బాధితులు చెబుతున్నారు. చిలకలూరిపేట రూరల్ సీఐ, నాదెండ్ల ఎస్‌ఐలు గతవారం రోజులుగా వేధిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. ఎలాంటి ఫిర్యాదులు లేకున్నా మండల టీడీపీ ముఖ్యనాయకుల ప్రోద్బలంతో పోలీసులు వేధిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వేధింపులు ఆపాలని కోరుతున్నారు.

30 వరకు ఈ-కేవైసీ గడువు పెంపు

కొరిటెపాడు(గుంటూరు): రైతులు తమ పంట వివరాలను ఈ-క్రాప్‌లో భాగంగా ఈ-కేవైసీ చేయించుకునేందుకు ఈ నెల 30వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. గుంటూరు జిల్లాలో 1,87,284 ఎకరాల్లో ఈ-కేవైసీ పూర్తి చేశామన్నారు. మరో 27,168 ఎకరాలకు రైతులు చేయించుకోవాల్సి ఉందని తెలిపారు. వంద శాతం పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం




మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయంలో నిత్యాన్నదానానికి గుంటూరు జిల్లా తెనాలికి చెందిన కొడాలి ప్రతాప్ కుమార్, సంధ్యారాణి దంపతులు వారి కుమారుడు షణ్ముఖ గణేష్ పేరిట రూ.లక్ష విరాళం ఇచ్చారు. బుధవారం ఉదయం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం ఆలయ ఏసీ శ్రీరామ వరప్రసాద రావుకు ఈ మొత్తాన్ని అందించారు. దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో అధికారులు సత్కరించారు. ఆలయ అధికారి బర్మా ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా శ్రీనివాసులు

నెహ్రూనగర్: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ గుంటూరు జిల్లా డిప్యూటీ కమిషనర్ (డీసీ)గా కె.శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్‌కుమార్ మీనా మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌వీవీఎన్ బాబ్జీ రావును విజయనగరం డీసీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో సెబ్ హెడ్ క్వార్టర్స్‌లో డీసీ(ట్రైనింగ్)లో ఉన్న కె.శ్రీనివాసులను గుంటూరుకు బదిలీ చేశారు. కాగా, మన్యం జిల్లాలో సెబ్ అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ)గా పనిచేస్తున్న ఎం.రవికుమార్‌రెడ్డిని అదే హోదాలో గుంటూరుకు, బాపట్ల డీపీఈఓగా పనిచేస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్(ఈఎస్) ఎ.అరుణకుమారిని గుంటూరు ఈఎస్‌గా బదిలీ చేశారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 589.10 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు 10,120, ఎడమకాలువకు 5,018, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 28,664, ఎస్ఎల్‌బీసీకి 2,400, వరదకాలువకు 600 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 37,580 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా ఇక్కడ నుంచి 46,802 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

గొప్పల డప్పు.. ఏదీ పప్పు?

- నెలాఖరుకు వచ్చినా జిల్లాలో ఇప్పటికీ సరఫరా కాని కందిపప్పు
- సత్వరం పునరుద్ధరించాలని కోరుతున్న లబ్ధిదారులు
- పెడచెవిన పెడుతున్న కూటమి ప్రభుత్వం
- జిల్లావ్యాప్తంగా 2,010 అంగన్‌వాడీ కేంద్రాలు
- ఇప్పటికే ఇస్తున్న వస్తువుల్లో కొన్నిటికి కోత
- నాణ్యతకు మంగళం
- పేరు మార్పు మినహా ప్రభుత్వం చేసిందేమి లేదంటున్న లబ్ధిదారులు

అంగన్‌వాడీ కేంద్రాల్లో కందిపప్పునకు మంగళం

జిల్లా వ్యాప్తంగా ఐసీడీఎస్ అధికారులు ఓవైపు పోషకాహార మాసోత్సవాలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా కూటమి నేతలు ఇంటింటికి తిరిగి మంచి ప్రభుత్వం అంటూ సొంత డప్పు కొడుతున్నారు. అయితే అంగన్‌వాడీ కేంద్రాల్లో నెల రోజులుగా కందిపప్పు సరఫరా లేక గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం అందక ఇబ్బందులు పడుతుంటే పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. కేంద్రాలలో అరకొర కూరగాయలతోనే నెట్టుకువస్తున్న పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పథకం పేరుమార్చి పలు వస్తువులకు కోత విధించిన కూటమి సర్కారు కందిపప్పునకు సైతం మంగళం పాడడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

సత్తెనపల్లి: జిల్లాలో 28 మండలాలు ఉండగా .. 9 ఐసీడీఎస్ ప్రాజెక్టులు (నరసరావుపేట, వినుకొండ, నాదెండ్ల, ఈపూరు, సత్తెనపల్లి, క్రోసూరు, గురజాల, మాచర్ల, పిడుగురాళ్ల) ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పును సరఫరా చేయడంలో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. నిర్దేశిత గడువు ముగిసినా కేంద్రాలకు అరకొరగా అందజేశారు. మార్కెట్‌లో తగినంత అందుబాటులో లేదంటూ కాలయాపన చేస్తున్న కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. లబ్ధిదారులకు ఇచ్చే బియ్యం, వంటనూనె, కందిపప్పును జిల్లా పౌర సరఫరాల శాఖ ద్వారా స్థానిక చౌక దుకాణ డీలర్లు అందజేస్తూ వచ్చారు. ప్రస్తుత మాసానికి బియ్యం, వంటనూనెలను ఆ శాఖే అందించింది. అయితే కందిపప్పు మాత్రం ఇవ్వలేదు. నెల రోజులుగా అదే పరిస్థితి కొనసాగుతోంది. కందిపప్పు సరఫరా అవుతుందా? లేదో? నని నిర్వాహకులు ఎదురు చూస్తున్నారు. కందిపప్పు లేకుండా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఏం వండి పెట్టాలో అర్థం కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని కేంద్రాల్లో కార్యకర్తలే సొంత డబ్బు వేసుకొని బయట కొనుగోలు చేసి వండి పెడుతున్న పరిస్థితి నెలకొంది.



బియ్యంతోనే సరి...

గర్భిణులు, బాలింతలకు రోజుకు 125 గ్రాముల బియ్యం, 30 గ్రాముల కందిపప్పు, 16 గ్రాములు చొప్పున నూనె అందించాల్సి ఉంది. ఇవన్నీ నెలకు సరిపడా వారి ఇంటికే ఇచ్చేయాలి. 3–5 ఏళ్ల చిన్నారులకు 75 గ్రాముల బియ్యం, 15 గ్రాముల కందిపప్పు, ఐదు గ్రాముల నూనెతో వంటచేసి కేంద్రంలోని అందించాలి. నెల రోజులుగా కందిపప్పు సరఫరా లేకపోవడంతో వంట చేసేందుకు నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. గర్భిణులు, బాలింతలకు బియ్యం, నూనెతో సరిపెడుతున్నారు.

మెనూలో కందిపప్పు కీలకం....

మెనూలో కందిపప్పు కీలకం. రోజూ ఏదో ఒక కూరగాయలతో కలిపి పప్పు చేయాలి. గర్భిణులు, బాలింతలంతా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి రేషన్ తీసుకెళ్లేవారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు రాలేని వారికి కూడా ఇంటికే సరుకులను అందించి ఆసరాగా నిలిచేది. ప్రస్తుత ప్రభుత్వంలో ఈ పద్ధతికి చెల్లు చీటీ పాడారు. లబ్ధిదారులకు కందిపప్పు సరఫరా నిలిచిపోవడంతో కేంద్రాలకు వచ్చే కార్య కర్తలు వంటకాల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు పౌష్టికాహారం నిలిచిపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ కె.ఉమారాణి వివరణ కోసం ప్రయత్నించగా ఆమె అందుబాటు లోకి రాలేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి తక్షణమే అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పు సరఫరా చేసి పోషకాహారం అందించేలా చర్యలు తీసుకోవాలని గర్భిణులు, బాలింతలు కోరుతున్నారు.

పేరు మార్పు మినహా చేసిందేమి లేదు..

కూటమి ప్రభుత్వం ప్రజలకు మంచి చేయకపోగా అడుగడుగునా వంచిస్తోంది. ముఖ్యంగా పేద ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచనే వారిలో కరువైంది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహార పంపిణీకి వైఎస్సార్ సంపూర్ణ పోషణ అని పేరు పెట్టింది. ఈ పథకం కింద నెలకు సరిపడా బియ్యం, కందిపప్పు, నూనె, రాగి పిండి, అటుకులు, ఖర్జూరం, చిక్కీలు, బెల్లం, పాలు, కోడిగుడ్లు అందించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పథకానికి బాల సంజీవని అని పేరు మార్చడం మినహా చేసింది ఏమీ లేదు. మంచి ప్రభుత్వమంటూ ఇంటింటా తిరుగుతూ కూటమి నేతలు ఊదరగొడుతున్నారని, అంగన్‌వాడీ కేంద్రాల్లో కందిపప్పు సైతం అందించలేకపోతున్నారని పలువురు ధ్వజమెత్తుతున్నారు.

జిల్లా సమాచారం ఇలా..

ఐసీడీఎస్ ప్రాజెక్టులు : 09	అంగన్‌వాడీ కేంద్రాలు : 2,010
మినీ అంగన్‌వాడీ కేంద్రాలు : 21	
సమోదైన గర్భిణులు : 12,438	సమోదైన బాలింతలు : 10,506
6 నెలల నుంచి 3 ఏళ్లలోపు చిన్నారులు : 65,020	
3 నుంచి 6 ఏళ్లలోపు చిన్నారులు : 47,527	

వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా అంబటి



పట్నంబజారు: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పలువురిని వివిధ పదవుల్లో నియమించారు. ఈ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి బుధవారం ఆదేశాలు వెలువడ్డాయి. వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా మాజీ మంత్రి అంబటి రాంబాబును నియమించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆయన సత్తెనపల్లి ఎమ్మెల్యేగా ఎన్నికై రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రిగా పనిచేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఆయన్ను నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి.

గుంటూరు, నరసరావుపేట పార్లమెంట్ పరిశీలకుడిగా మోదుగుల



గుంటూరు, నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గాల పార్టీ పరిశీలకుడిగా మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డిని నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. గతంలో నరసరావుపేట ఎంపీగా, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఆయన ఎన్నికయ్యారు. వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ ఇన్‌చార్జిగా కూడా పనిచేశారు.

మంగళగిరి సమన్వయకర్తగా దొంతిరెడ్డి



వైఎస్సార్‌సీపీ మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా దొంతిరెడ్డి శంకర్‌రెడ్డి (వేమారెడ్డి)ని నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం దొంతిరెడ్డి మంగళగిరి, తాడేపల్లి పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా ఉన్నారు.

యార్డుకు 53,149 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): మార్కెట్ యార్డుకు బుధవారం 53,149 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 51,039 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 18,600 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.9,000 నుంచి రూ.16,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ.9,000 నుంచి రూ.18,700 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,500 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 26,374 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

పర్చూరు సీహెచ్‌సీకి అరుదైన గౌరవం

- ఆసుపత్రిలో అందుతున్న సేవలకు ప్రత్యేక హోదా
- ఆసుపత్రి అభివృద్ధికి ప్రత్యేక నిధులు విడుదల చేయనున్న కేంద్రం
- జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు



పర్చూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్

పర్చూరు(చినగంజాం): పర్చూరు ప్రభుత్వ వైద్యశాల (కమ్యూనిటీ హెల్త్ సెంటర్)కు అరుదైన గౌరవం లభించింది. ప్రజలకు ఉత్తమ సేవలందించడంలో సీహెచ్‌సీ అగ్రభాగాన నిలిచి ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకుంది. నేషనల్ హెల్త్ సిస్టం రీసెర్చ్ సెంటర్ మినిస్ట్రీ ఆఫ్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, నేషనల్ క్వాలిటీ ఆఫ్ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్‌ల ఆధ్వర్యంలో పర్చూరు ప్రభుత్వ వైద్యశాలలో సెప్టెంబరు 9,10 తేదీలలో రెండురోజులపాటు సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో పర్చూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ 83.47 శాతం స్కోర్ సాధించి జాతీయ స్థాయిలో నిలిచింది. బాపట్ల జిల్లాలోనే అరుదైన అవకాశాన్ని పర్చూరు సీహెచ్‌సీ దక్కించుకుంది. ప్రధానంగా ఎమర్జెన్సీ, ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్, ల్యాబ్, ఫార్మసీ, క్లీన్ అండ్ గ్రీన్, ఆపరేషన్ థియేటర్ సేవలు, యాక్సిడెంట్ కేసుల సేవలలో ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రత్యేక గుర్తింపు సాధించిన సీహెచ్‌సీ అభివృద్ధికి కేంద్రం ప్రత్యేకంగా నిధులు అందజేయనుంది.

బీపీటీకి దేశవ్యాప్త ప్రాధాన్యం



- బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానంలో విత్తనాలు ఉత్పత్తి
- బ్రీడర్ సీడ్‌తోపాటు ఫౌండేషన్ సీడ్ ఇక్కడే ఉత్పత్తి
- బ్రీడర్ సీడ్ కంపెనీలకు, ఫౌండేషన్ సీడ్ రైతులకు
- బీపీటీ 5204కు డిమాండ్
- బ్రీడర్‌సీడ్‌గా పది రకాలు ఉత్పత్తి చేస్తున్న వ్యవసాయ పరిశోధనా స్థానం
- ఫౌండేషన్ సీడ్‌గా నాలుగు రకాలు ఉత్పత్తి చేస్తున్న వ్యవసాయ కళాశాల క్షేత్రం
- 124 ఎకరాల్లో సీడ్ ఉత్పత్తి కోసం వేగంగా వరినాట్లు
- మే నాటికి అందుబాటులోకి 2 వేల క్వింటాళ్ల వరి వంగడాలు
- బీపీటీ రకాలకు ఆంధ్ర, తెలంగాణలతో పాటు ఉత్తరాది రాష్ట్రాల్లోనూ డిమాండ్

మనది ప్రధానంగా వ్యవసాయాధారిత దేశం. దేశ జీడీపీలో వ్యవసాయ రంగానిదే అగ్రస్థానం. దక్షిణ భారతంలో వరి ముఖ్యమైన ఆహారంగా ఉంటుండగా, ఉత్తరాదిలో సైతం గోధుమ తర్వాత చెప్పుకోదగ్గ స్థాయిలోనే వరిని పండిస్తుంటారు. చీడపీడలను తట్టుకుని, బలవర్ధకమైన వరిని ప్రజలకు అందించేందుకు బాపట్ల వ్యవసాయ పరిశోధనా స్థానం నిరంతరం శ్రమిస్తోంది. ఇక్కడ ఉత్పత్తి చేసిన బీపీటీ వరి విత్తనాలకు దేశవ్యాప్తంగా 'ప్రా'ధాన్యం' ఉంది. బీపీటీ 5204 రకంతోపాటు ఇక్కడే ఉత్పత్తి చేసిన పదిరకాల వరి విత్తనాలను మన రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల రైతులు సైతం అమితాసక్తితో సాగు చేస్తున్నారు. తమిళనాడు, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, పంజాబ్ వంటి పెద్ద రాష్ట్రాల్లో లక్షల హెక్టార్లలో బాపట్ల వంగడాలను సాగుచేయడమే దీనికి నిదర్శనం. దీంతో బాపట్ల వ్యవసాయ పరిశోధనా స్థానం దేశవ్యాప్తంగా కీర్తి ప్రతిష్టలు అందుకుంటోంది.

సాక్షి ప్రతినిధి, బాపట్ల: బాపట్ల వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఉత్పత్తి చేసిన బీపీటీ వరి విత్తనాలకు దేశ వ్యాప్తంగా డిమాండ్ నెలకొన్న నేపథ్యంలో ఇక్కడ పెద్దఎత్తున వరి విత్తనాల ఉత్పత్తి సాగుతోంది. బాపట్లలో ఉత్పత్తి చేసిన బీపీటీ 5204 రకంతో పాటు ఇక్కడే ఉత్పత్తి చేసిన పదిరకాల వరి విత్తనాలను మన రాష్ట్రంతోపాటు తెలంగాణ, పశ్చిమ బెంగాల్, ఒడిశా, తమిళనాడు, కర్ణాటక, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల రైతులు సాగు చేస్తున్నారు. దీంతో బాపట్ల వ్యవసాయ పరిశోధనా స్థానం దేశవ్యాప్తంగా కీర్తి ప్రతిష్టలు అందుకుంటోంది.

బీపీటీ 5204కు ఎందుకింత డిమాండ్?

1986లో బాపట్లలో ఉత్పత్తి చేసిన బీపీటీ 5204 రకం వరి పంట కాలం 140 నుంచి 145 రోజులు కాగా బియ్యం తెలుపు రంగులో సన్నగా ఉండి అన్నానికి అనుకూలంగా ఉంటుంది. 1000 గింజల బరువు 14.5 గ్రాములు ఉండి అధిక దిగుబడినిస్తుంది. వినియోగ దారులు ఇష్టపడే ఈ రకానికి డిమాండ్ అధికం. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో 20 లక్షల హెక్టార్లలో రైతులు ఈ రకాన్ని సాగుచేస్తున్నారు. దీంతో పాటు బాపట్లలో తయారు చేసిన బీపీటీ 2782, 2595, 2270, 2295, 2231, 3291, 2846, 2841, 3082,2411 రకాల వరి విత్తనాలకు దేశవ్యాప్తంగా ప్రాచుర్యం లభించింది. పైరకాల వరిలో దిగుబడులు అధికంగా ఉండడంతో రైతులు వీటిని సాగు చేసేందుకు మొగ్గుతున్నారు.

బాపట్ల వంగడాలను 'వరి'ంచిన అదృష్టం



బాపట్ల వ్యవసాయ కళాక్షేత్రం



బాపట్ల వ్యవసాయ కళాక్షేత్రంలో వరినాట్లు

వారంలోపు నాట్లు పూర్తి...

ఈ ఏడాది 11 బీపీటీ రకాల విత్తనాలను 21 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. గత నెలరోజుల నుంచి వ్యవసాయ పరిశోధనా స్థానంలోని పొలాల్లో పై రకాలకు చెందిన వరి నాట్లు వేస్తున్నారు. వారంలోపు మొత్తం నాట్లు పూర్తి కానున్నాయి. మే నెల చివరినాటికి వరి హార్వెస్టింగ్‌కు రానుంది. ప్రాసెసింగ్ అనంతరం సర్టిఫై చేసి బ్రీడర్ వరివిత్తనాలను ఏపీ సీడ్స్‌తోపాటు పలు ప్రైవేటు కంపెనీలకు అందించనున్నారు. దీంతోపాటు వ్యవసాయ పరిశోధనా స్థానం బీపీటీ 2846, 2595 రకాల ఫౌండేషన్ సీడ్‌ను రైతులకు చెందిన 11 ఎకరాల్లో ఉత్పత్తి చేసి విత్తనాలను జిల్లా రైతులకు పంపిణీ చేయనున్నారు. మరో వైపు బాపట్ల వ్యవసాయ కళాశాల క్షేత్రంలో ఫౌండేషన్ సీడ్‌ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేసి రైతులకు విత్తనాల కింద అందించనున్నారు. ఇందు కోసం బీపీటీ 5204, 2782, 2595, 2270 రకాల విత్తనాలను 103 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వరినాట్లు పూర్తయ్యాయి. మే నెల నాటికి వరి కోతలు పూర్తిచేసి ప్రాసెసింగ్ అనంతరం సర్టిఫై చేసి సీడ్‌ను రైతులకు అందించనున్నారు. ఈ ఏడాది సుమారు 1600 క్వింటాళ్ల విత్తనాలను ఇక్కడ ఉత్పత్తి చేస్తున్నారు.

రైతులకు సరఫరా..

నేషనల్ సీడ్ కార్పొరేషన్ బాపట్ల వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఉత్పత్తి చేసిన బ్రీడర్ సీడ్‌ను తీసుకొని ఫౌండేషన్ సీడ్‌గా పునరుత్పత్తి చేసి దేశవ్యాప్తంగా పెద్దఎత్తున రైతులకు అందజేస్తోంది. మరోవైపు ఏపీ సీడ్స్‌తో పాటు పలు ప్రైవేట్ సీడ్ కంపెనీలు ఇక్కడి బ్రీడర్‌సీడ్ కొనుగోలు చేసి ఫౌండేషన్ సీడ్‌గా మార్చి రెండు తెలుగు రాష్ట్రాల రైతులకు అందిస్తున్నారు. ప్రతి ఏటా ఇక్కడి వ్యవసాయ క్షేత్రంలో 20 నుంచి 25 ఎకరాల్లో 400 క్వింటాళ్లకు పైగా బ్రీడర్ సీడ్‌ను ఉత్పత్తి చేసి ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీల ద్వారా రైతులకు సరఫరా చేస్తున్నారు.



బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానం

దేశ వ్యాప్తంగా రైతులకు బీపీటీ విత్తనాలు



బాపట్ల వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఇప్పటివరకు 15 రకాల వరి వంగడాలను ఉత్పత్తి చేశాం. వీటిలో బీపీటీ 5204 అత్యంత ప్రాచుర్యం పొందింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఈరకం వరిని రైతులు సాగు చేస్తున్నారు. ప్రతి ఏటా ఇక్కడ బ్రీడర్ సీడ్‌ను ఉత్పత్తిచేసి ప్రభుత్వ, ప్రైవేటు సీడ్ కంపెనీలకు ఇస్తున్నాం. వారు బ్రీడర్‌ను ఫౌండేషన్ సీడ్‌గా మార్చి దేశంలోని పలు రాష్ట్రాల రైతులకు అందిస్తున్నారు. ఈ ఏడాది 21 ఎకరాల్లో 11 రకాల బీపీటీ వరి విత్తనాలను బ్రీడర్ సీడ్‌గా ఉత్పత్తి చేస్తున్నాం. సుమారు 400 క్వింటాళ్ల విత్తనాలను ఉత్పత్తి చేసి మే నెలలో ప్రభుత్వంతోపాటు ప్రైవేటు కంపెనీలకు సరఫరా చేస్తాం.

– కృష్ణవేణి, ప్రిన్సిపల్ సైంటిస్ట్ అండ్ హెడ్, వ్యవసాయ పరిశోధనా స్థానం, బాపట్ల

రైతుల కోసం ఫౌండేషన్ సీడ్ ఉత్పత్తి



బాపట్ల వ్యవసాయ కళాశాల క్షేత్రం పరిధిలో 103 ఎకరాల్లో బీపీటీ 5204, 2782, 2595, 2270 నాలుగు రకాల వరి విత్తనాలను ఫౌండేషన్ సీడ్‌గా సాగు చేస్తున్నాం. ప్రస్తుతం వరినాట్లు పూర్తయ్యాయి. మే నెల నాటికి హార్వెస్టింగ్ చేస్తాం. అనంతరం ప్రాసెసింగ్ చేసి సర్టిఫికేషన్ అనంతరం విత్తనాలను రైతులకు అందిస్తాం. సుమారు 1600 క్వింటాళ్ల విత్తనాలను వచ్చే సీజన్‌కు రైతులకు అందించాలన్నది లక్ష్యం. రాష్ట్ర వ్యాప్తంగా అవకాశమున్న మేర వరి విత్తనాలను పంపిణీ చేస్తాం. ప్రతిఏటా ఇక్కడ వరి విత్తనాలను ఉత్పత్తిచేసి రైతులకు అందిస్తున్నాం.

– అరుణ, సీనియర్ సైంటిస్ట్ అండ్ హెడ్, వ్యవసాయకళాశాల క్షేత్రం, బాపట్ల

జిల్లాలో 25 మండలాల్లో వర్షం

అత్యధికంగా చిలకలూరిపేటలో 75.2 మిల్లీమీటర్లు

నరసరావుపేట: జిల్లాలో గడిచిన 24 గంటల వ్యవధిలో మూడు మండలాలు మినహా మిగతా 25 మండలాల్లో వర్షం కురిసినట్లు బుధవారం అధికారులు తెలియచేశారు. మొత్తం 28 మండలాలు ఉండగా వాటిలో వెల్దుర్తి, దుర్గి, కారెంపూడి మినహా మిగతా మండలాల్లో 342.8 మి.మీటర్ల వర్షం కురిసిందన్నారు. అత్యధికంగా చిలకలూరిపేటలో 75.2 మి.మీ వర్షం పడగా, మాచర్లలో 2.0, రెంటచింతల 2.2, గురజాల 3.4, దాచేపల్లి 6.6, పిడుగురాళ్ల 54.4, మాచవరం 5.2, బెల్లంకొండ 8.0, అచ్చంపేట 3.0, క్రోసూరు 1.4, అమరావతి 40.8, పెదకూరపాడు 8.0, సత్తెనపల్లి 2.8, రాజుపాలెం 3.0, నకరికల్లు 6.8, బొల్లాపల్లి 2.6, వినుకొండ 8.2, నూజెండ్ల 22.6, శావల్యాపురం 14.0, ఈపూరు 7.8, రొంపిచర్ల 2.0, నరసరావుపేట 13.6, ముప్పాళ్ల 4.4, నాదెండ్ల 20.4, యడ్లపాడు 24.4 మిల్లీ మీటర్ల వర్షం పడింది.

రేపు గ్రహణ మొర్రి ఉచిత స్క్రీనింగ్ క్యాంప్

డీఈఓ. వెంకటేశ్వర్లు

నరసరావుపేట ఈస్ట్: బసవతారకం ఇండో అమెరికన్ కాన్సర్ హాస్పిటల్ (స్మైల్ ట్రిన్ సెంటర్), సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీన శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో ఉచిత గ్రహణ మొర్రి స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. గ్రహణ మొర్రి (చీలిక పెదవి, అంగిలి చీలిక)తో బాధపడే 6 నెలల వయస్సు నుంచి 50 సంవత్సరాలు వయస్సు కలిగిన వారు హాజరు కావచ్చని వివరించారు. గ్రహణ మొర్రి ఆపరేషన్ జరిగిన వారు సైతం శిబిరానికి హాజరై తగిన వైద్య సలహాలు, సేవలు పొందవచ్చని తెలిపారు. శిబిరంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కాన్సర్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

వరద బాధితులకు రూ.5 లక్షల సామగ్రి పంపిణీ



సామగ్రితో బయలుదేరుతున్న బస్సు వద్ద చైర్మన్ లావు రత్తయ్య

చేబ్రోలు: తాడేపల్లిలోని వరద బాధితులకు రూ.5 లక్షల విలువగల గృహ సామగ్రిని అందజేసినట్లు చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ బుధవారం తెలిపారు. విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య సదరు వస్తువులతో బయలుదేరిన బస్సును జెండా ఊపి ప్రారంభించారు. వైస్ చాన్సలర్ మాట్లాడుతూ.. ఇటీవల వరద ప్రాంతాల్లో ముంపునకు గురైన 500 కుటుంబాలకు ఈ సామగ్రి పంపిణీ చేశామన్నారు. నులకపేట చైతన్య తపోవన్ శ్రేయో కళ్యాణ మండపంలో కార్యక్రమం నిర్వహించామన్నారు. ఆయా విభాగాల డీన్లు, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్త సచ్చిదానందమూర్తి పేరిట పోస్టల్ కవర్ విడుదల



ఏఎన్‌యూ: ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి పేరిట ప్రత్యేక పోస్టల్ కవర్‌ను బుధవారం విడుదల చేశారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సచ్చిదానందమూర్తి సెంటర్ ఫర్ స్టడీస్ ఇన్ ఆఫ్రో ఏషియన్ ఫిలాసఫీస్ డైరెక్టర్ ఆచార్య త్రిమూర్తి రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆచార్య సచిదానందమూర్తి శతజయంతి ఉత్సవాలు ఏఎన్‌యూలో నిర్వహించడం ఎంతో గర్వకారణం అన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో జన్మించిన గొప్ప తత్వవేత్త సచ్చిదానందమూర్తి అని కొనియాడారు . మానవ జీవన విధానాన్ని తన రచనలతో విపులంగా వివరించారన్నారు. ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె. గంగాధరరావు మాట్లాడుతూ.. కొత్త సచ్చిదానందమూర్తి తత్వశాస్త్రానికి కొత్త భాష్యం చెప్పారని పేర్కొన్నారు. భారతీయ తత్వశాస్త్రాన్ని విశ్వవ్యాప్తం చేశారన్నారు. చైనాలో సైతం సేవలు అందించడం ఆయన ప్రతిభకు నిదర్శనమని తెలిపారు. విజయవాడ ప్రాంతీయ పోస్ట్ మాస్టర్ జనరల్ డీఎస్‌వీఆర్ మూర్తి మాట్లాడుతూ.. ఈ ప్రత్యేక పోస్టల్ కవర్లను విడుదల చేయడం గొప్ప విషయం అన్నారు. రెక్టార్ ఆచార్య కె రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, వర్సిటీ కళాశాలల ప్రిన్సిపల్స్ ఆచార్య సీహెచ్ స్వరూపారాణి, ఆచార్య కె. వీరయ్య, ఆచార్య పి.సిద్ధయ్య, ఆచార్య ఏ ప్రమీలారాణి ప్రసంగించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నది విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 91699 22299

WANTED

■ తెనాలి బాపట్ల చీరాల రేపల్లె నరసరావుపేట సత్తెనపల్లి మా బ్రాంచ్ ఆఫీసులలో పనిచేయుటకు పురుషులు, స్త్రీలు కావలెను. Qul: 7th-PG, Sal: 18,000-25,000. Cont: 9030740757

■ 10th, ఇంటర్, డిగ్రీ, B.Tech చదివి ఖాళీగా ఉంటున్నవారికి ఆఫీసులు, షోరూమ్‌లు, షాపింగ్ మాల్స్, Ltd కంపెనీలలో మా సంస్థ ద్వారా ప్లేస్‌మెంట్స్ కలవు. ఓన్లీ ఆఫీస్ వర్క్ 9963255441

■ యడ్లపాడు వద్ద బోయపాలెంలో పనిచేయుటకు సెక్యూరిటీ ఆఫీసర్ కావలెను. అ.డిగ్రీ,12గం-17000 గుంటూరునిటీలోపనిచేయుటకు సెక్యూరిటీగార్డ్స్ కావలెను.అ:10th,ఇంటర్.12గం-15000 9502087373

■ ప్రముఖ స్టార్ హోటల్ గీతాంజలీ నందు పని చేయుటకు నాన్‌వెజ్ కిచెన్ ఇన్‌ఛార్జ్, సెక్యూరిటీ ఇన్‌ఛార్జ్, టైమ్ ఆఫీస్, నాన్‌వెజ్ చైనీస్ మాస్టర్స్, కిచెన్ అసిస్టెంట్స్, హౌస్‌కీపింగ్ సూపర్ వైజర్స్, రెస్టారెంట్ కెప్టెన్స్, ఆర్డర్ టేకర్స్ మరియు డ్రైవింగ్ లైసెన్సు కలిగి మంచి అనుభవం ఉన్న డ్రైవర్స్ వెంటనే కావలెను. అనుభవమును బట్టి మంచి జీతం ఇవ్వబడును. సంప్ర: 4/1 అరండల్‌పేట, గుంటూరు. 98490 77525

■ బెంజ్ మరియు ఫార్చ్యూనర్ కార్లు నడుపుటకు అనుభవం గల డ్రైవరు కావలెను. ✆ 9398991579

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692

■ డైరెక్ట్ జాయినింగ్: ప్లాస్టిక్, స్టీల్, పాలడెయిరీ, కోల్డ్ స్టోరేజ్, కోకో కోలా, పెప్సీ, సోప్స్, టుబాకో, టెక్స్‌టైల్స్, హెచ్‌వైజర్స్, స్టోర్ ఇన్‌ఛార్జ్ ITI, Dip. All, జీ: 18-32 వేలు. PF, ESI. ✆ 87122 09709

■ విజయవాడలో పేషెంట్లని, పెద్దవారిని వారి ఇంటి వద్దే ఉండి చూసుకొనుటకు నర్సులు (ANM, GNM) హాస్పిటల్స్‌లో పనిచేసిన ఆయాలు, హోమ్‌కేర్‌లో అనుభవమున్న కేర్ టేకర్స్ కావలెను. జీతం 16K-26K కాల్ / వాట్సప్ ✆ 91608 35559, 98850 25559

■ షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో నర్సులు, కాంపౌండర్స్, వార్డ్ బాయ్స్, ఆయాలు, లేడి సూపర్‌వైజర్స్ భార్యభర్తలు కావలెను.Ph: 9391036931, 9246585901

■ హైదరాబాద్‌లో ప్రముఖ యూనివర్సిటీలో 200 మంది (Ex-Army) సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. (జీతం:8Hrs. 19,500/- & 12 Hrs. 28,200/-, 4సెలవులు + ఉచిత వసతి).ఫోన్: 9959433789

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీ: 18k. ఫోన్: 9640258899, 9840468899

■ రాయపూర్ (ఛత్తీస్‌గఢ్) ఊరు లో క్లౌడ్ కిచెన్‌లో తెలుగు వెజ్ వంటలు చేయడానికి ఒక అనుభవశాలియైన కుక్ కావాలి. జీతము వంట నైపుణ్యాలు బట్టి. సంప్రదించండి: 9425203443

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (4లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
ఈ పేపర్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
7075167541
7075167663

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

డైవర్షన్ పాలిటిక్స్ మానుకోండి

- సూపర్ సిక్స్‌ని అమలు చేయండి
- కూటమి ప్రభుత్వానికి కాంగ్రెస్ నాయకుల హితవు
- కలెక్టరేట్ ఎదుట తాలి బజావ్ కార్యక్రమం



కలెక్టరేట్ ప్రవేశద్వారం ముందు నినాదాలు చేస్తున్న నాయకులు

నరసరావుపేట: అధికారంలో ఉన్న టీడీపీ కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ విడనాడి ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఏపీసీసీ ఇచ్చిన ఆదేశాల మేరకు డీసీసీ అధ్యక్షుడు గర్నెపూడి అలెగ్జాండర్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టరేట్ ముందు 'తాలి బజావ్' కార్యక్రమం నిర్వహించారు. పళ్లాలపై శబ్దాలు చేశారు. అలెగ్జాండర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, ప్రతినెలా రూ.3 వేలు నిరుద్యోగ భృతి, ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు, రైతులకు రూ.20 వేలు, ప్రతి మహిళకు నెలకు రూ.1500లు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించలేదు అన్నారు.

టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చే ముందు వారు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలు 100 రోజుల పరిపాలన పూర్తయినా కూడా అమలు చేయటంలో విఫలమైందన్నారు. సూపర్ 6 హామీలలో ఒక్కటి కూడా మొదలు పెట్టకుండా సున్న మార్కులతో కొనసాగుతుందన్నారు. ఇప్పటికైన టీడీపీ కూటమి ప్రభుత్వం కళ్లు తెరుచుకొని డైవర్షన్ పాలిటిక్స్ మానుకొని ప్రజలకు మంచి పరిపాలన అందించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ రాష్ట్ర నాయకులు మద్దు రాధాక్రిష్ణ, వేదాద్రి, జ్ఞానరాజ్ పాల్, మాచర్ల, సత్తెనపల్లి, వినుకొండ, నరసరావుపేట నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు డాక్టర్ రామచంద్రరెడ్డి, చుక్క చంద్రపాల్, చెన్న శ్రీనివాస్, ఎస్.ఎం.బాషా, పీసీసీ డెలిగేట్ సీదా కృష్ణ, యువజన నాయకులు నాగేంద్ర, రవికిషోర్ పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమలు కోసం ఆందోళనకు సిద్ధంకండి

పీడీఎం రాష్ట్ర కమిటీ నాయకుల పిలుపు

నరసరావుపేట: రాష్ట్రంలో ఉన్న అధికార కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా సూపర్ సిక్స్ హామీలు అమలుచేయాలని కోరుతూ ప్రతి ఒక్కరూ ఆందోళనకు సిద్ధం కావాలని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) రాష్ట్ర కమిటీ నాయకులు పిలుపు ఇచ్చారు. ఈ మేరకు బుధవారం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారంలోకి వచ్చి 100 రోజులు గడిచినా నేటికీ తెలుగుదేశం, జనసేన పార్టీలు హామీలు అమలు చేయకుండా గొప్పలు చెప్పుకుంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. రైతులకి ఏడాదికి రూ.20 వేలు, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ప్రతి ఇంటిలో ఎంతమంది చదువుకుంటే అంత మందికి ఆర్థిక సహాయం, ప్రతి మహిళకు రూ.1500లు, నిరుద్యోగ భృతి రూ.3 వేలు, 20 లక్షల ఉద్యోగాలు ఇలాంటి అనేక హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకుని అధికారం చేపట్టి వంద రోజులు దాటిన వాటిని కాగితాలకే పరిమితం చేయటం సరైంది కాదన్నారు. పెన్షన్లు మాత్రమే అమలు చేస్తూ ల్యాండ్ టైటిల్ యాక్ట్, జగన్ ఫొటోలతో ఉన్న పాసు పుస్తకాలు రద్దు చేసినట్లు ప్రకటించారే కాని ఇంకా అమలు కాలేదన్నారు. హామీలు అమలయ్యేంతవరకు ఆందోళనకు సిద్ధం కావాలని ప్రజలకు పిలుపు ఇచ్చారు.

డెంగీ డేంజర్ బెల్స్

- జిల్లాలో 226 డెంగీ కేసులు
- సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో అధిక కేసులు నమోదు
- కేసులు బయటపడినచోట పర్యటించిన వైద్యఆరోగ్యశాఖ అధికారులు



రూపెనగుంట్లలో పాత రోలులో పెరుగుతున్న దోమలను కాలనీ వాసులకు చూపిస్తున్న డాక్టర్ రవీంద్ర రత్నాకర్

నరసరావుపేట: జిల్లా ప్రజలను విష జ్వరాలు, రోగాలు పట్టి పీడిస్తున్నాయి. ముఖ్యంగా సత్తెనపల్లి, పెదకూరపాడు రూరల్ పరిధిలోని గ్రామాల్లో డెంగీ జ్వరాల కేసులు విస్తృతంగా నమోదవుతున్నాయి. దోమల ప్రభావంతో ప్రస్తుతం 226 డెంగీ, రెండు మలేరియా కేసులు నమోదయ్యాయి. కురుస్తున్న వర్షాలతో నీరు ఎక్కడబడితే అక్కడ నిలబడి పోవటంతో పాటు మాగాణి పొలాల్లో వరినాట్లు వేసే కాలం కావటంతో గ్రామాల్లో దోమల ప్రభావం అధికంగా ఉంది. దీంతో పాటు పల్నాడు ప్రాంతంలో తాగునీరు కలుషితం కావటం వలన టైఫాయిడ్ జ్వరాలు, డయేరియా విజృంభిస్తున్నాయి. ఈ కారణాలతో ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటళ్లు, గ్రామాల్లో ఆర్ఎంపీ కేంద్రాలు రోగులతో కిక్కిరిసిపోతున్నాయి. నకరికల్లు మండలం రూపెనగుంట్ల, సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడులలో డెంగీ కేసులు బయటపడటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. బుధవారం వీఆర్వోలు, ఆరోగ్య సిబ్బందితో కలిసి ఆయా గ్రామాలను సందర్శించి రోగుల ఇళ్ల పరిసరాలను పరిశీలించి స్థానికులకు జాగ్రత్తలు చెప్పారు. దీనిపై స్థానిక మలేరియా జిల్లా అధికారి రవీంద్ర రత్నాకర్‌ను వివరణ కోరగా జ్వరాలు వస్తున్నమాట నిజమేనని, డెంగీ కేసులు బయటపడిన చోట ఆయా ప్రదేశాల్లో రోగ కారక దోమల నివారణకు విస్తృతంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీంతో పాటు స్థానికులను దోమలు పెరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై జాగ్రత్తలు చెబుతున్నామన్నారు.

జీజీహెచ్‌కు రూ. 4 లక్షల విరాళం



డాక్టర్ కిరణ్‌కుమార్‌కు ల్యాప్‌టాప్ అందజేస్తున్న న్యూరో సైంటిస్ట్ అసోసియేషన్ నేతలు

గుంటూరు మెడికల్ : ఏపీ న్యూరో సైంటిస్ట్ అసోసియేషన్ నేతలు బుధవారం గుంటూరు జీజీహెచ్‌కు రూ. 4 లక్షల విరాళాన్ని అందజేశారు. ఆగస్టులో గుంటూరులో అసోసియేషన్ రాష్ట్ర సమావేశం విజయవంతంగా జరిగింది. అప్పటి నిర్ణయం మేరకు జీజీహెచ్ న్యూరాలజీ, న్యూరోసర్జరీ వైద్య విభాగాలకు ఈ మొత్తం ఇచ్చారు. సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. ఈ విరాళంతో విద్యార్థుల కోసం ల్యాప్‌టాప్‌లను కొనుగోలు చేశామన్నారు. దాతలను అభినందించారు. సీనియర్ న్యూరాలజిస్టులు డాక్టర్ తారక్‌నాథ్, డాక్టర్ పమిడిముక్కల విజయ ఆసుపత్రి అభివృద్ధికి సేవలు అందించారని ప్రశంసించారు. కార్యక్రమంలో న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఉప్పుటూరి అరుణ కుమారి, న్యూరోసర్జరీ విభాగాధిపతి డాక్టర్ సత్యనారాయణ మూర్తి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ గొట్టిపాటి బిందు నర్మద, డాక్టర్ భార్గవి దేవి, డాక్టర్ చక్కా శివరామ కృష్ణ, డాక్టర్ వీరమ్మ పాల్గొన్నారు.

స్ట్రోక్ యూనిట్‌కు ఐఎస్ఓ స్టాండర్డ్ సర్టిఫికెట్

అత్యంత నాణ్యతా ప్రమాణాలతో పేద రోగులకు కార్పొరేట్ వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్న గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ విభాగంలోని స్ట్రోక్ యూనిట్‌కు ఐఎస్ఓ స్టాండర్డ్ సర్టిఫికేషన్ లభించింది. ఈ విషయాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ బుధవారం మీడియాకు వెల్లడించారు.

కొనసాగుతున్న కాంట్రాక్టు స్టాఫ్‌నర్సుల నిరసన



నిరసన తెలియజేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు బుధవారం కూడా విధులు బహిష్కరించారు. సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ నెల 4న విడుదల చేసిన జీవో నంబరు 115ను రద్దు చేయాలంటూ డిమాండ్ చేశారు. రెగ్యులర్ స్టాఫ్‌నర్సు ఉద్యోగాల నోటిఫికేషన్ 15 ఏళ్లుగా ప్రభుత్వం ఇవ్వకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. తమ డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చకపోతే నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సుల యూనియన్ రాష్ట్ర నాయకురాలు పి.మనీష, జిల్లా అధ్యక్షురాలు రేణుక, సెక్రటరీ శివమ్మ, కోశాధికారి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షురాలు కోటేశ్వరి, సౌజన్య, కరుణ, జాయింట్ సెక్రటరీలు హైమావతి, సంధ్య, మేరీ, రమాదేవి, సభ్యులు కుసుమ కుమారి, సుధారాణి, బాలసుందరి, అంజమ్మ, సురేష్, సర్దార్, సుభాని పాల్గొన్నారు.

జీతాల బిల్లు కోసం తిప్పలు

జీజీహెచ్‌లో 20 రోజులుగా కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు తమ సర్వీసు రెగ్యులర్ చేయాలంటూ డిమాండ్ చేస్తూ వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. వారికి వేతనాల బిల్లు సమర్పించేందుకు అధికారులు మెలిక పెట్టారు. వారు లిఖిత పూర్వకంగా ఒకరోజు సెలవు పెట్టుకున్నట్లు లేఖ ఇస్తేనే వేతనాలు విడుదల చేసే బిల్లుకు హాజరు పంపిస్తామని నర్సింగ్ అధికారులు చెబుతున్నారు.

దీంతో మూడు రోజులుగా కాంట్రాక్టు నర్సింగ్ సిబ్బంది సంతకాల కోసం సూపరింటెండెంట్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వాస్తవానికి రోజూ అనుమతి తీసుకుని కేవలం రెండు గంటలు మాత్రమే నిరసన ప్రదర్శన చేస్తున్నప్పటికీ.. ఒక్కరోజు పూర్తిగా విధులకు హాజరు కాలేదంటూ నర్సింగ్ అధికారులు తమను ఇబ్బంది పెడుతున్నారని కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు వాపోతున్నారు. తమ కు ప్రతినెలా ఉండే క్యాజువల్ లీవ్స్‌లో ఒక లీవును తగ్గించి వేతనాలు మంజూరుకు హాజరు పంపిస్తే సరిపోతుందని పేర్కొంటున్నారు. ఆ విధంగా చేయకుండా లిఖిత పూర్వకంగా సంతకాల పేరుతో తమను మానసిక క్షోభకు గురిచేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

రెగ్యులర్ స్టాఫ్‌నర్సుల యూనియన్ నాయకులు సైతం తమ సమస్యలను నర్సింగ్ అధికారులతో మాట్లాడి సామరస్యంగా పరిష్కారమయ్యేలా చూడకుండా చోద్యం చూస్తున్నట్లు వాపోయారు.

గులాబీ రంగు పురుగు నిర్మూలించండి

- లింగాకర్షక బుట్టలు అమర్చండి
- పత్తి రైతులకు వ్యవసాయాధికారి మురళి సూచన



కొమెరపూడిలో వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు



మాట్లాడుతున్న మురళి

సత్తెనపల్లి: ప్రత్తి పంట ప్రస్తుతం పూత, కాయ దశలో ఉందని, గులాబీ రంగు పురుగు ఉనికిని గమనించటానికి ఎకరానికి 4 నుంచి 8 లింగాకర్షక బుట్టలు అమర్చాలని పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి సూచించారు. సత్తెనపల్లి మండలం కొమెర పూడి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలోఆయనతోపాటు లాం ఫాం శాస్త్రవేత్త ఎం. వెంకట రాములు, సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి ఎస్.శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళి మాట్లాడుతూ లింగాకర్షక బుట్టలలో వరుసగా 3 రోజులు 8 తల్లి రెక్కల పురుగులు గమనించినట్టైతే వెంటనే సస్య రక్షణచర్యలు చేపట్టాలన్నారు. గులాబీ రంగు పురుగు నివారణకు 5 శాతం వేప గింజల కషాయం, 5 మి.లీ. వేప నూనె లీటరు నీటికి కలిపి పిచికారీచేయాలన్నారు. లేదా ప్రొఫెనోఫోస్-2 మి.లీ, థయోడీకార్బ్ -1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. రైతులు భూసార పరీక్షలు ఆధారంగా ఎరువులు వాడుకోవాలని సూచించారు. లాం ఫాం శాస్త్రవేత్త ఎం.వెంకటరాములు మాట్లాడుతూ రైతులు ఫాస్ఫరస్ సాల్యూబులైజింగ్ బ్యాక్టీరియా అయిన జీవన ఎరువులు వాడినట్లయితే భూమిలో అలభ్య స్థితిలో ఉన్న ఫాస్ఫరస్ ఎరువును లభ్య స్థితిలోకి తీసుకు వస్తుందన్నారు. జీవన ఎరువులు వాడుకొని రసాయనిక ఎరువుల వాడకం తగ్గించుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి ఎస్.శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి రైతు వారు సాగు చేస్తున్నటు వంటి ప్రతి పంటను ఈ-పంట యాప్ ద్వారా పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

భూముల పరిహారంపై విచారణ

ఎన్‌హెచ్160ఎలో భూములు కోల్పోయే రైతులతో జేసీ భేటీ



రైతులతో మాట్లాడుతున్న జేసీ సూరజ్‌గనూరే, ఆర్డీవో సరోజని

నాదెండ్ల: నకరికల్లు అడ్డరోడ్డు నుంచి చీరాల ఓడరేవు వరకూ నిర్మిస్తున్న నాలుగు లైన్ల జాతీయ రహదారి (160ఎ) నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులతో జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనూరే సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఇర్లపాడు గ్రామంలో 17 మంది రైతులకు 3.23 ఎకరాలు, కనపర్రు గ్రామంలో 9 మంది రైతులకు గాను 44 సెంట్లు, గణపవరం గ్రామంలో ఒక రైతుకు గాను 63 సెంట్లు వెరశి 4.20 ఎకరాల భూమి రహదారికి రైతులో కోల్పోతున్నారు. సమావేశంలో రైతులకు సంబంధించిన యాజమాన్య హక్కుపత్రాలు, ఆధారాలు పరిశీలించారు. రిజిస్ట్రేషన్ వ్యాల్యూపై రెండున్నర రెట్లు అధికంగా ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందని, మొత్తం 81.6 కిలోమీటర్ల నిడివిలో పనులు జరుగుతున్నాయని జేసీ తెలిపారు. రెండు నెలల్లో నష్టపరిహారం సొమ్ము రైతుల ఖాతాల్లో జమ అవుతాయన్నారు. కార్యక్రమంలో నరసరావుపేట ఆర్డీవో సరోజని, తహసీల్దార్ ఏవీ రమణ, మండల సర్వేయర్ సురేంద్రనాథ్, డిప్యూటీ తహసీల్దార్ అనురాధ, ఆర్ఐ రమీజా, వీఆర్వోలు నాగరాజు, మురళీకృష్ణ, వెంకట రమణ, వి.సాంబశివరావు, వీరయ్య ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న డీపీఎం అమలకుమారి

నరసరావుపేట రూరల్: ప్రకృతి వ్యవసాయ విధానంలోకి రైతులను మార్చే విధంగా సిబ్బంది కృషిచేయాలని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి తెలిపారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా కార్యాలయంలో బుధవారం సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. డీపీఎం మాట్లాడుతూ రైతులు గట్లను ఐదు అడుగుల వెడల్పుతో చేసి గట్లపై జామ, బొప్పాయి, అరటి వంటి పండ్ల జాతి, తీగ జాతి, ఆకుకూరలు, కూరగాయలను సాగు చేయాలని తెలిపారు. దీని వలన వచ్చే ఆదాయం ప్రధాన పంటపై ఖర్చుకు లభిస్తుందని తెలిపారు. అదనపు ఆదాయంతో రైతులకు ఆర్థిక వేసులుబాటు దొరుకుతుందని వివరించారు. జిల్లాలో ప్రస్తుతం మిరప పంట మొక్కలు నాటే దశలో ఉందన్నారు. ప్రతి రైతు తప్పనిసరిగా బీజామృతంతో నారు శుద్ధి చేయడం ద్వారా మొక్క నుంచి భూమి నుంచి వచ్చే తెగుళ్లను పూర్తిగా నివారించవచ్చని తెలిపారు. దీంతోపాటు మొక్కలకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. మిరప మొక్కలు నాటిన తరువాత ప్రతి రెండు మిరప మొక్కల మధ్యలో ఉల్లి, బంతి, ముల్లంగి, కొత్తిమీర వేయడం ద్వారా చీడపీడల నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అదనపు డీపీఎం ప్రేమ్‌రాజ్, ఎన్ఎఫ్ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ వలంటీరుపై టీడీపీ శ్రేణులు దాడి

ఆస్పత్రికి తరలింపు



చికిత్స పొందుతున్న సాంబిరెడ్డి

లంకెలకూరపాడు(ముప్పాళ్ల): ఇంట్లో అన్నం తింటున్న పూర్వ వలంటీరుపైన, అడ్డు వచ్చిన కుటుంబసభ్యులపైన టీడీపీ శ్రేణులు మూకుమ్మడిగా దాడి చేసిన సంఘటన మండల పపరిధిలోని లంకెలకూరపాడు గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన కె.సాంబిరెడ్డి గత ప్రభుత్వ హయాంలో వలంటీరుగా పనిచేశాడు. ఇది మనసులో పెట్టుకున్న టీడీపీకి చెందిన కిష్టిపాటి శివారెడ్డి, కిష్టిపాటి రామలింగా రెడ్డి, కిష్టిపాటి రవీంద్రరెడ్డి, సుబ్బారెడ్డి, కోటిరెడ్డి, మోర్తాల వెంకటరెడ్డి మరి కొంతమంది ఎన్నికల నాటి నుంచి తరచూ ఇబ్బందులకు గురిచేస్తూ గొడవ పెట్టుకుంటూ ఉన్నారు. ఈ క్రమంలోనే పొలం వద్ద పంటకాల్వ విషయంలో వివాదం జరగటంతో పోలీసులు, రెవెన్యూ సమక్షంలో వలంటీరు సాంబిరెడ్డి తన పొలం నుంచి కింద భూములకు నీరు ఇచ్చేలా అంగీకారం చేసుకున్నారు. మళ్లీ కింద పొలానికి నీరు ఇచ్చే విషయంలో బుధవారం సాంబిరెడ్డి, టీడీపీ వర్గీయులైన శివారెడ్డి, రామ లింగారెడ్డిల మధ్య వివాదం జరిగింది.

ఈ నేపథ్యంలో ఇంట్లో అన్నం తింటున్న సాంబిరెడ్డిపై టీడీపీ శ్రేణులు విచక్షణారహితంగా దాడి చేశారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన సాంబిరెడ్డి తండ్రి వెంకట్రామిరెడ్డి, అన్న శివారెడ్డిలపైన దాడి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరి ఇరువర్గాల వారిని తరిమివేశారు. దాడిలో గాయపడిన సాంబిరెడ్డిని చికిత్స నిమిత్తం ముప్పాళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు.


తరచూ ఇబ్బందులకు గురిచేస్తూనే ఉన్నారు

ఎన్నికల నాటి నుంచి ఇప్పటి వరకు నాపై దాడి చేస్తూనే ఉన్నారు. ఇప్పటికి ఎనిమిది సార్లు పోలీస్‌స్టేషన్‌కి పిలిపించి భయభ్రాంతులకు గురిచేశారు. మూడు ఎకరాల వరిపొలాన్ని పాడు చేశారు. ఇంట్లో అన్నం తింటున్న నాపై దాడి చేశారు. అడ్డువచ్చిన కుటుంబసభ్యులపైన దాడికి పాల్పడ్డారు. భయపడి కుటుంబసభ్యులు ఆత్మహత్యాయత్నంకు ప్రయత్నించారు.

–కిష్టిపాటి సాంబిరెడ్డి, బాధితుడు

భోజనంలో నాణ్యతా లోపంపై ఆగ్రహం

- ఏజెన్సీ నిర్వాహకులపై సమగ్ర శిక్ష ఏపీసీ మండిపాటు
- విద్యార్థుల గైర్హాజరు
- హెచ్‌ఎం తీరుపై అసంతృప్తి



ఏజెన్సీ నిర్వాహకులను హెచ్చరిస్తున్న జి.విజయలక్ష్మి

ప్రత్తిపాడు: పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో నాణ్యత లేకపోవడంపై సమగ్ర శిక్ష ఏపీసీ జి. విజయలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ భోజనం తినని విద్యార్థుల ట్యాబ్‌లు రిటర్న్ తీసుకోవాలని కూడా హెచ్‌ఎంను ఆదేశించారు. మండల పరిధిలోని చినకోండ్రుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును బుధవారం ఏపీసీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. నాణ్యత, రుచి లోపించడంతో ఏజెన్సీ నిర్వాహకురాలు కుమారిని ప్రశ్నించారు. కూర చేశామంటే చేశామన్నట్లు ఉండకూడదన్నారు. గుజ్జు కోసం కూర మొత్తంలో శనగపిండి కలపడం సరికాదని పేర్కొన్నారు. భోజనం వండే పద్ధతి మార్చుకోవాలని స్పష్టంచేశారు. మరో రెండు సార్లు వస్తానని, నాణ్యత ఇలానే ఉంటే ఏజెన్సీని మారుస్తామని హెచ్చరించారు. భోజనం, కూరలు ఇలా వండుతుంటే మీరేం చేస్తున్నారని హెచ్‌ఎం విజయ్‌కుమార్‌ను ప్రశ్నించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించారు. మొత్తం 205 మంది విద్యార్థులకుగాను 170 మంది వచ్చారు. దీనిపై హెచ్‌ఎంను ప్రశ్నించారు. గైర్హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేశారా అని అడిగారు. చేయలేదని హెచ్‌ఎం సమాధానమిచ్చారు. దీంతో ఆమె అసహనానికి గురై.. చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎంను ఆదేశించారు.